సాక్షి
ప్రకాశం

గురువారం । 13 । ఫిబ్రవరి । 2025



ఆధార్ కార్డుల జారీలో నిర్లక్ష్యం తగదు

ఆధార్ కార్డుల జారీలో నిర్లక్ష్యం తగదని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. - 8లో..



పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

పెండింగ్ కేసులపై దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33/20

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పొగ మంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన శ్యామల



శ్యామలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో కలిసిన శ్యామలకు జెడ్పీచైర్‌పర్సన్ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. అనంతరం పార్టీ విషయాలపై చర్చించారు.

ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా రామకృష్ణ

ఒంగోలు: ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా సీహెచ్‌వీ రామకృష్ణకు పదోన్నతి కల్పిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్(విజిలెన్స్) బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గుంటూరు జిల్లా మంగళగిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ పదోన్నతి పొందారు. తాజాగా ఈయనను ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్.హేమలతను ప్రస్తుతం ఒంగోలులో ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ పదోన్నతి పొందిన షేక్ ఇబ్రహీం షరీఫ్‌ను కృష్ణా జిల్లా అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం ఈయన ఒంగోలు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బాధ్యతలతోపాటు ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బాధ్యతలను కూడా చూస్తున్నారు. ఈ బాధ్యతలన్నింటినీ ఒంగోలు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జికి అప్పగించాలని ఉత్తర్వుల్లో రిజిస్ట్రార్ పేర్కొన్నారు.


నాగభైరవ సాహిత్య పురస్కారానికి ఇద్దరు ఎంపిక

ఒంగోలు మెట్రో: దివంగత సాహితీవేత్త, జాతీయ కవి డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట ఏటా ఇచ్చే సాహిత్య ప్రతిభా పురస్కారానికి 2024 సంవత్సరానికి గాను ఒంగోలుకు చెందిన కళామిత్ర మండలి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, 2025 సంవత్సరానికి రెడ్డి బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సెట్లెం చంద్రమోహన్‌లను ఎంపిక చేసినట్లు నాగభైరవ సాహిత్య పురస్కార కమిటీ చైర్మన్ డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుంటూరులోని బృందావన గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదిక మీద ఈనెల 27న నిర్వహించే సభలో పురస్కారాలు అందిస్తారని తమకు సమాచారం అందినట్లు పురస్కార గ్రహీతలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వరించని మద్దతు..!

- వరి రైతులకు లభించని మద్దతు
- జిల్లాలో నామమాత్రంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- బస్తా ధాన్యం రూ.1800కు కొనుగోలు చేసి నిలువు దోపిడీ చేస్తున్న దళారులు
- క్వింటాకు రూ.500 వరకూ తగ్గింపు
- ఖరీఫ్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా
- ప్రభుత్వ కొనుగోలు లక్ష్యం 10 శాతం
- రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

అన్నదాత కష్టాన్ని దళారులు అడ్డంగా దోచేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా తక్కువకు కొనుగోలు చేసి దగా చేస్తున్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. నామ నాత్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు దిగుబడిలో 10 శాతం కూడా కొనుగోలు చేయకుండా చేతులెత్తేసింది. ఫలితంగా కొనుగోళ్లలో దళారీల దోపిడీ పర్వానికి అంతేలేకుండా పోయింది. చెమటోడ్చి పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో రైతాంగం విలవిల్లాడిపోతోంది.



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అన్నదాతకు కష్టకాలం దాపురించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. రైతు భరోసా పథకం కింద క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో జమ చేసింది. పుష్కలంగా పంటలు పండటంతో పాటు రైతు భరోసా డబ్బు రైతుకు కొండంత అండగా నిలిచింది. ప్రభుత్వం మారింది...టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ రైతులకు కష్టాలు మొదలయ్యాయి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వరి ధాన్యానికి మంచి ధర పలికింది. దీంతో రైతులకు లాభాలు వచ్చాయి. ఫలితంగా ఖరీఫ్ సీజన్లో కర్షకులు భారీగా వరి సాగు చేశారు. జిల్లాలో దాదాపు 15 వేల హెక్టార్లలో ఈ పంట వేశారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారు. హెక్టారుకు ఈ ఖరీఫ్ సీజన్‌లో 3.4 నుంచి 4 మెట్రిక్ టన్నుల చొప్పున ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ లెక్కన రమారమి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు అంచనా. రైతుల సొంత అవసరాలు.. స్థానిక అవసరాలకు కలుపుకొని సగానికి అవసరం అనుకున్నా 25 వేల మెట్రిక్ టన్నులు పోను మిగతా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి రైతుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది.

కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కేవలం 5 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం జిల్లా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించింది. మార్కెట్‌లో రైతుల వద్ద 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకానికి సిద్ధంగా ఉంటే 5 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించటమంటే రైతులు దళారుల చేతుల్లో చిక్కి శల్యం కావటమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ధాన్యం క్వింటాకు గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 ఇవ్వనుండగా కామన్ ధాన్యం రకానికి రూ.2,300 ఇస్తోంది. ఈ ధరకు రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తే రైతులు అప్పుల నుంచి బయట పడతారు. అలాంటిది రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయక పోవటంతో దళారులు కల్లాల్లోనే అతి తక్కువ ధరకు కొనుగోలు చేసుకుపోతున్నారు. రైతులు చేసేది లేక క్వింటా ధాన్యం రూ.1600 నుంచి రూ.1800 లోపు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితిని చంద్రబాబు ప్రభుత్వం కల్పిస్తోంది. అంటే రైతు ప్రతి క్వింటాకు రూ.500 మేర తీవ్రంగా నష్టపోతున్నాడు. ఈ లెక్కన 20 వేల క్వింటాళ్లు దళారులకు అమ్ముకోవటం ద్వారా జిల్లాలోని రైతాంగం దాదాపు రూ.కోటి మేర తీవ్రంగా నష్టపోతోంది. ఇదిలా ఉండగా ప్రభుత్వం జిల్లాలో కేవలం 39 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు రాక అవస్థలు..

అన్నదాతలు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యంతో దళారుల ఉచ్చులో పడి తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం ఇప్పటి వరకు 7.78 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని జిల్లా వ్యాప్తంగా కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో డబ్బులు రాకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి.

పెట్టుబడి సాయం లేక రైతులు విలవిల...

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి రైతన్నలకు పెట్టుబడి సాయం లేకపోవటంతో విలవిల్లాడుతున్నారు. 2024 ఎన్నికల సమయంలో రైతులకు ఆర్థిక సాయం అందిస్తామని నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మాట దాటేస్తున్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉంది, సంపద సృష్టించిన తరువాత ఎన్నికల హామీలను నెరవేరుస్తామని కల్లబొల్లి కబుర్లు చెబుతూ రైతులను దగా చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి వరుణుడు మొఖం చాటేశాడు. వర్షాలు లేకపోవటంతో పంటల సాగు కూడా మరీ దారుణంగా తయారైంది. 2024 సంవత్సరానికి ముందు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్‌లో 2 లక్షలకు పైగా హెక్టార్లలో వరి సాగయ్యేది. ప్రస్తుతం ఖరీఫ్‌లో కేవలం 15 వేల హెక్టార్లలో మాత్రమే వరి సాగు చేపట్టారు. దానికి తోడు అష్టకష్టాలు పడి వరి పంటను సాగు చేసి ధాన్యం పండిస్తే మద్దతు ధర లేక రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

బాహాటంగానే దోపిడీ...

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా ఏర్పాటు చేయటంతో దళారులు బాహాటంగానే దోపిడీకి పాల్పడుతున్నారు. మద్దతు ధరపై బస్తాకు రూ.500 నుంచి రూ.600 వరకు తక్కువ ధర ఇస్తున్నారు. వడ్లకు మార్కెట్లో డిమాండ్ లేదు...రోజులు గడిచేకొద్దీ ధాన్యాన్ని అడిగేవారు ఉండరని దళారులు రైతులను బెదిరిస్తున్నారు. వీరి మాటలు నమ్మి విక్రయించేందుకు వెళితే "మట్టి, తేమశాతం ఎక్కువగా ఉందని.. బియ్యం విరుగుతూ ఉన్నాయి" అంటూ సాకులు చూపించి భయపెడుతున్నారు. ఐదు నుంచి ఆరు కిలోల వరకు తరుగు రూపంలో అదనంగా లాగేస్తూ మోసాలకు తెగబడుతున్నారు. ఈ దందా గ్రామాల్లో విచ్చలవిడిగా జరుగుతున్నా రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు, బాధ్యత కలిగిన ప్రజా ప్రతినిధులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. వ్యాపారులు ఇచ్చే మామూళ్లకు తలొంచి రైతు కష్టాన్ని దళారీలకు దాసోహం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఏటా మాగాణి సాగు చేస్తాను. ఈ ఏడాది కూడా 20 ఎకరాల వరకు సాగు చేశాను. అయితే ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది తీవ్ర వర్షాల వలన పంట వరదకు పోతే తిరిగి మళ్లీ నాట్లు వేయాల్సి వచ్చింది. దీంతో మాగాణి సాగే ఖర్చు తీవ్రతరమైంది. దీనికి తోడు గత ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోరి మార్కెట్ కమిటీ ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనేవాళ్లు. ఈ ఏడాది ఇంత వరకు ప్రభుత్వం తరపున కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి అనే ఆలోచన కూడా చేయకపోవడంతో దళారుల ప్రభావం ఎక్కువైంది. మిషన్ కోత వలన వచ్చిన పంటలో తేమ శాతం, తాలు అనే సాకులు చూపెట్టి దళారులు ధరలను దిగజార్చుతున్నారు. వరి పంటకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2300 కు గాను ప్రస్తుతం దళారులు కేవలం రూ.1700 కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఈ రకంగా సరాసరిన నాకే రూ.2 లక్షల మేర నష్టం వస్తోంది. ప్రభుత్వం ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల పై దృష్టి సారించాలి.

– అక్కి సాంబయ్య, రైతు ఈదుమూడి

రాష్ట్రంలో మహిళలపై పెరిగిన దాడులు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల

ఒంగోలు వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు, చిన్నారులపై రోజుకో దారుణం జరుగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల అన్నారు. ఒంగోలు వచ్చిన శ్యామల బుధవారం వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏలూరులో ఓ చిన్నారిని స్కూల్ టీచర్ దారుణంగా కొట్టారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదని, మెడికల్ కళాశాలకు అనుమతులు రాకుండా చేశారన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చి ధరలు తగ్గించలేదని, గుడి, బడి తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని మండిపడ్డారు. మద్యపానం వల్ల కుటుంబాల్లో కలతలు రేగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి సూచీలో రాష్ట్రం 15వ స్థానంలో ఉంటే ప్రస్తుత ప్రభుత్వంలో 18వ స్థానానికి దిగజారిందన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరి ధాన్యాన్ని రైతుల వద్ద ప్రైవేటు వ్యాపారులు క్వింటాలుకు రూ.1500 నుంచి రూ.1800 మధ్య కొనుగోలు చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వలనే రైతులకు ఈ దుస్థితి వచ్చిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం క్వింటాలు మద్దతు ధర వరికి రూ.2,300లుగా నిర్ణయించిందన్నారు. దీని వలన రైతులు రూ.1500లకు పైగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మిర్చి, శనగలు పండించిన రైతులు కూడా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కార్యక్రమం ద్వారా ప్రతి రైతును ఆదుకుందని చెప్పారు. కల్తీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ఎనిమిది నెలల కాలంలో ఏమి అభివృద్ధి సాధించారో ప్రజలకు తెలిసిపోయిందన్నారు. సినిమా మీద కొన్ని వందల కుటుంబాలు బతుకుతాయన్నారు. సినిమా వేదికలపై రాజకీయాలు మాట్లాడటం తప్పని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, ఒంగోలు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బడుగు ఇందిర, రాష్ట్ర మహిళా నాయకురాలు రమణమ్మ, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి నరాల రమణారెడ్డి, బొట్ల సుబ్బారావు, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, పల్నాటి రవీంద్ర రెడ్డి, నగరికంటి శ్రీనివాసరావు, పోలినేని కొటేశ్వరరావు, దుంపా చెంచురెడ్డి, గుడ్డల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఆలూరులో రీ సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొత్తపట్నం: మండలంలో ఆలూరు రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆలూరు రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీసర్వేను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీ సర్వే ఎంత మంది చేస్తున్నారు, ఎన్ని ఎకరాల్లో చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీ సర్వే చేసే భూముల్లో ముందుగా రైతులకు నోటీసుల ద్వారా తెలియపర్చాలన్నారు. ఎక్కడా తప్పులు లేకుండా రీ సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. చనిపోయిన వారికి వారి వారసుల పేరు మీద మ్యుటేషన్ చేయాలన్నారు. చిన్న తప్పు చేయకుండా రీ సర్వే పూర్తి చేయాలని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ నాలుగు టీమ్‌లుగా ఏర్పడి రీ సర్వే చేస్తున్నామని, ఇప్పటికే 600 ఎకరాలు పూర్తి చేశామన్నారు. అనంతరం కలెక్టర్ భూముల మ్యాప్‌ను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, డీఐవో శ్రీనివాసరావు, మండల సర్వేయర్ సుధీర్, విలేజ్ సర్వేయర్ షేక్ జిలానీబాషా, వీఆర్వో వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

లేని వ్యవస్థకు మంత్రా.. ఇదేం విడ్డూరం

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎద్దేవా



సింగరాయకొండ: రాష్ట్రంలో గ్రామ వాలంటీర్ వ్యవస్థ లేదని, లేని బిడ్డకు పేరు ఎలా పెడతానని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మంత్రి స్వామి గ్రామ వలంటీర్, సచివాలయ శాఖామాత్యునిగా ఎలా ఉంటారని, లేని వ్యవస్థకు మంత్రి ఉంటాడా ఇదేం విడ్డూరం అని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఎద్దేవా చేశారు. కొండపిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, కూటమి నాయకులు గ్రామ వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని వారికి ఇచ్చే గౌరవ వేతనం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని మభ్యపెట్టారన్నారు. తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జీఓ నంబరు 52 ప్రకారం గత సంవత్సరం జూన్ 14వ తేదీ మంత్రుల శాఖలతో కూడిన గెజిట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ప్రకారం రాష్ట్ర మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామికి సోషల్ వెల్ఫేర్, దివ్యాంగులు, వయోవృద్ధులు, సచివాలయం, గ్రామ వలంటీర్ల శాఖామాత్యునిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతి అధికారిక సమావేశాల్లో మంత్రుల శాఖను గుర్తు చేసే నేమ్‌బోర్డులో గ్రామ వాలంటీర్ల శాఖా మంత్రి అని ఉంటుందని గుర్తు చేశారు. అంతేకాక గత సంవత్సరం విజయవాడలో కూటమి ప్రభుత్వ నిర్వాకం కారణంగా వచ్చిన వరదల్లో సహాయక చర్యలు చేసేందుకు గ్రామ వాలంటీర్ల సేవలను వినియోగించుకుని వారి వివరాలను హాజరు పట్టికలో కూడా నమోదు చేసుకున్నారు. కానీ తరువాత అసలు ఆ వ్యవస్థే లేదని బుకాయించారని విమర్శించారు. ఈరోజు వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి వలంటీర్లను రోడ్డు పాలు చేసి వారికి జీతం ఇవ్వకుండా మంత్రి స్వామి మాత్రం వాలంటీర్ల శాఖా మంత్రిగా జీతం తీసుకుంటున్నాడని, అది సిగ్గుచేటని విమర్శించారు. వలంటీర్లు ఉద్యమంలా లేని వ్యవస్థకు మంత్రిగా ఎలా ఉంటావని స్వామిని నిలదీయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని వలంటీర్లను విధుల్లో కొనసాగించాలని, లేకపోతే లేని వ్యవస్థకు మంత్రిగా ఉన్న స్వామిని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సరస్వతీ విద్యాసంస్థల యాజమాన్యం



వావిలాల వెంకట్ హర్షిత్

ఒంగోలు సిటీ/మద్దిపాడు: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మద్దిపాడుకు చెందిన వావిలాల వెంకట్ హర్షిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. వావిలాల మహేష్, శ్రీలతల కుమారుడైన హర్షిత్ మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.45 శాతం పర్సంటైల్ సాధించాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులు విద్యార్థిని అభినందించారు.

సత్తా చాటిన సరస్వతీ విద్యా సంస్థల విద్యార్థులు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటారు. జేఈఈ మెయిన్స్‌లో 90 శాతం పైన సాధించిన విద్యార్థులు 20 మంది, 85 శాతం పైన విద్యార్థులు 38 మంది, 80 శాతం పర్సంటేజ్ సాధించిన విద్యార్థులు 56 మంది ఉన్నారు. వారిలో కె.లోక్ క్రిటి 98.82, కే గుణశేఖర్ రెడ్డి 98.71, ఎస్ ఇంద్ర 98.6, బీ రిత్విక్ 96.56, జీ ఎనుష్ రాయ్ 96.21, కే రథసారథి 96.09, వీ పవన్ కళ్యాణ్ 95.37 పర్సంటైల్ సాధించారు. మంచి పర్సంటైల్ సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత రమణారెడ్డి బుధవారం అభినందించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో 99 శాతం సాధించి జిల్లాలో మొదటి స్థానంతో పాటు జిల్లా టాప్ పది స్థానాలు సాధించామని చెప్పారు. సరస్వతి విద్యాసంస్థల డైరెక్టర్లు ఎ.గణేష్ రెడ్డి, ఎ.గంగా శంకర్ రెడ్డి, సీఈఓ ఎస్.వి.సురేష్, ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శనగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

పంట మార్పిడితో ఎండు తెగులు నివారణ

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: శనగ పంటలో వచ్చే ఎండు తెగులు నివారణకు పంట మార్పిడి ఒక్కటే మార్గమని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలు మండల పరిధిలోని కొత్త మామిడిపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం ఏవో కిషోర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ బీ రమేష్ బాబు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపికృష్ణ పాల్గొని మాట్లాడారు. కూరగాయలు, బంతి వివిధ రకాల పూల సాగు చేసే రైతులకు ఉద్యానవన శాఖ పథకాల గురించి వివరించారు. శనగ పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులు తమకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందించాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని అడిగారు. శనగల సబ్సిడీ 40 శాతానికి పెంచాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు కే రామకృష్ణారెడ్డి, ఆదిమూర్తి, వ్యవసాయ సహాయకుల నాగమణి, రైతులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె



యర్రగొండపాలెం: స్థానిక చాకలి వారి వీధిలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మట్టి మిద్దె కూలింది. బెల్లంకొండ రంగస్వామి, అంజలీలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఒక్కసారిగా మిద్దె కూలింది. దీంతో వారు శిథిలాల్లో ఇరుక్కొపోయారు. ఇంట్లో ఉన్న వంట సామాగ్రి మొత్తం ధ్వంసం అయ్యాయి. మిద్దె కూలే సమయంలో పెద్ద శబ్దం రావడంతో పరిసర ప్రాంతాల వారు అక్కడికి చేరి వారిని శిథిలాల నుంచి బయటికి తీశారు. అదృష్టవశాత్తు రంగస్వామి, అంజలిలకు ఎటువంటి గాయాలు కాలేదు.

ఆధార్ కార్డుల జారీలో నిర్లక్ష్యం తగదు

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఆరేళ్ల లోపు బాలలకు ఆధార్‌కార్డుల జారీ కోసం ప్రత్యేక శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బందితో బుధవారం స్థానిక ప్రకాశం భవనంలో సమావేశం నిర్వహించారు. ఆధార్‌కార్డు లేని పిల్లలకు తక్షణమే జారీ చేసేందుకు నిర్వహిస్తున్న శిబిరాల తీరు, పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనితీరు పేలవంగా ఉన్న సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పీడీని ఆదేశించారు. నెట్‌వర్క్ సక్రమంగా లేదని, మిషన్లు పని చేయడం లేదని కుంటి సాకులు చెబుతూ ఇతర శాఖలపై నెపం మోపేలా ప్రవర్తిస్తే సహించమని స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఉన్న చోట్ల కూడా కొందరు సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉందని అభినందించారు. సాకులు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఉపేక్షించమన్నారు. ఆధార్ శిబిరాల నిర్వహణ ప్రధాన బాధ్యత ఐసీడీఎస్ అధికారులదేనన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోస్టల్ అధికారుల సహకారం తీసుకొని సమన్వయంతో శిబిరాలు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్న వారికి తక్షణమే ఆధార్ కార్డుల కోసం వివరాలు నమోదు చేయాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి తొలుత వాటిని మంజూరు చేసేలా చూడాలని చెప్పారు. దీనిపై రోజువారీ నివేదికను తనకు అందజేయాలని పీడీని ఆదేశించారు.

ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించండి

లక్ష్యం మేరకు ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టడంపై దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం । స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర । కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మన జిల్లాలో సుమారు 15 వేల ఇంకుడుగుంతలు నిర్మించాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. నిర్మాణానికి అవసరమైన సామగ్రిని రెండు రోజుల్లో సమకూర్చుకొని శనివారం జిల్లావ్యాప్తంగా ఈ పనులు ప్రారంభమయ్యేలా పర్యవేక్షించాలని డ్వామా అధికారులను ఆదేశించారు. బాల్య వివాహాలు, పోషకాహార లోపాలను నివారించడం కోసం ।బంగారు బాల్యం। కార్యక్రమంలో భాగంగా రూపొందించిన సర్వేను వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీపీఓ వెంకట నాయుడు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చుండూరు



ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించండి

- ఎస్పీ ఏఆర్ దామోదర్



సంతనూతలపాడు పోలీసు సిబ్బందితో సమావేశమైన జిల్లా ఎస్పీ దామోదర్

సంతనూతలపాడు: పెండింగ్ కేసులపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రికార్డులు పరిశీలించి ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, మహిళా సహాయక కేంద్రం, రికార్డు రూం, లాకప్ రూం, వెయిటింగ్ హాళ్లు, పాత పీఎస్ స్థలాన్ని పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనాలు, ఇతర వస్తువులను పరిశీలించి వాటిని త్వరితగతిన డిస్పోజల్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణ వ్యూహాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులకు సంబంధించి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ విస్తృతంగా నిర్వహించి దొంగతనాలు జరగకుండా చూసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. చెరువు మలుపు వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో బ్లాక్ స్పాట్ ఉన్న ప్రదేశాల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేలా స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, మలుపుల వద్ద రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. నేరాలను ఛేదించడంలో సిబ్బంది సాంకేతికను అందిపుచ్చుకోవాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, రూరల్ సీఐ ఎన్ శ్రీకాంత్‌బాబు, సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు, ఏఎస్సై వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణ వ్యూహాలపై అధికారులను పలు సూచనలు చేశారు. గ్రానైట్ క్వారీల్లో ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో ప్రతిభ చూపిన సిబ్బందికి రివార్డులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ సుబ్బారావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు, చీమకుర్తి ఎస్సై వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసు నిందితునికి రిమాండ్



నిందితునితో పోలీసులు

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువులో తండ్రి పైడిపోగు ఏసును కుమారుడు మరియదాసు ఆదివారం హత్య చేసిన విషయం విదితమే. నిందితుడు మరియదాసును పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు మరియదాసు నుంచి త్రిపురాంతకం సీఐ డి.హసన్ వివరాలు సేకరించారు. సంబంధిత వీఆర్‌ఓ రిపోర్టు, గ్రామస్తుల రిపోర్టు, పోలీసు రిపోర్టు నమోదు చేశారు. బుధవారం దర్శి సబ్ కోర్టులో మరియదాసును హాజరుపరిచారు. జడ్జి నిందితునికి రిమాండ్ విధించారు. ఆయన వెంట ఎస్ఐ.త్యాగరాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

ఒంగోలు: లారీ నిర్లక్ష్యానికి నడిపి రెండు నిండు ప్రాణాలు బలి తీసుకున్న లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన లారీ డ్రైవర్ పత్తిపాటి ఆదినారాయణ 2019 ఫిబ్రవరి 7వ తేదీ లారీని అతివేగంగా నడిపి ఆటోను ఢీకొట్టాడు. ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన పాలపర్తి సుభాషిణి, ఇండ్ల రమణమ్మ అనే ఇద్దరు మరణించగా కొంత మందికి గాయాలయ్యాయి. అప్పటి నాగులుప్పలపాడు ఎస్సై జేబీఎన్ ప్రసాద్ కేసు నమోదుచేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితునిపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు ఎక్సైజ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్ కోమలవల్లి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వాదించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణ్‌కుమార్, గుడ్ ట్రయల్ మానిటరింగ్ చేసిన అప్పటి నాగులుప్పలపాడు ఎస్సై జేబీఎన్ ప్రసాద్, కోర్టు కానిస్టేబుల్ పోతురాజులను ఎస్పీ ఏఆర్ దామోదర్ అభినందించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్సై

పెద్దదోర్నాల: మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితున్ని అరెస్టు చేసి చోరీ చేసిన బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. స్థానిక ఇందిరా నగర్‌లో జరిగిన దొంగతనానికి సంబంధించి బుధవారం యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు..నంద్యాల జిల్లా ఆత్మకూరుకు చెందిన షేక్ మహబూబ్‌బాష వృత్తిరీత్యా గృహ నిర్మాణ పనుల్లో రాడ్ బెండింగ్ పనులు చేసేవాడు. గతంలో 15 దొంగతనం కేసుల్లో నిందితుడైన మహబూబ్ బాష గత నెల 4వ తేదీన మేల్ నర్స్ రాజేష్ నాయక్ ఇంట్లో చోరీకి పాల్పడి 20 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించాడు. అదే రోజున పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో ఓ రైతు ఇంట్లో సైతం 6 గ్రాముల బంగారాన్ని దొంగతనం చేశాడు. దొంగతనాలకు సంబంధించి ఆయా పోలీసుస్టేషన్‌లలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ క్రమంలో కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న ఎస్సై మహేష్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం శ్రీశైలం రహదారిలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న నిందితున్ని అదుపులోనికి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నిందితుడు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. కేసులో దొంగలించిన బంగారాన్ని స్వాధీనం చేసుకోని నిందితున్ని మార్కాపురం కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

కేసును వేగవంతంగా ఛేదించినందుకు ఎస్సై మహేష్, కానిస్టేబుల్ శ్రీను, హోంగార్డు నారాయణలను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా పోలీసుల ప్రతిభ



అథ్లెటిక్స్ సత్తా చాటిన పోలీసులను అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: అనంతపురంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో 30 ప్లస్ ఏజ్ గ్రూపు విభాగంలో ప్రకాశం జిల్లా పోలీసులు ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో ఏఆర్ విభాగం ఆర్ ఎస్సై సురేష్, కానిస్టేబుల్ శ్రీనివాసరావులు నాలుగు బంగారు, ఒక సిల్వర్ మెడల్ చొప్పున సాధించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే మరోవైపు క్రీడలపై ఆసక్తితో నిరంతరం ప్రాక్టీస్ చేస్తూ పతకాలు సాధించి ప్రకాశం జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు. త్వరలో బెంగళూరులో జరగనున్న జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలో కూడా సత్తా చాటి జిల్లా పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించకుంటే శాఖాపర చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రభుత్వ నిర్దేశించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సకాలంలో సాధించాలని, లేకుంటే వారిపై శాఖాపర చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. జిల్లాలోని వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. మాతా శిశు వైద్య సేవలు సకాలంలో ప్రజలకు అందించని వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రీయ బాల స్వస్థత కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు స్క్రీనింగ్, ఇతర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఇతర వైద్య సేవల కోసం రిఫర్ చేయాలన్నారు. వైద్యాధికారులు, సంబంధిత అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు సమీక్షించి రోజు వారి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఏ తల్లి జన్మనిస్తూ మరణించకూడదు, ఏ బిడ్డ జన్మిస్తూ మరణించకూడదు అనే నినాదంతో ప్రతి ఆరోగ్య శాఖ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిబ్బంది అందరూ ప్రభుత్వం కేటాయించిన జాబ్‌చార్టు ప్రకారం విధులు నిర్వర్తించాలన్నారు. డాక్టర్ తిరుమలరావు సవరించిన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ భగీరథి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ సుజన్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ హేమంత్, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ అనిల్, మధుసూధనరావు, విక్టర్, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు, జిల్లా డేటా మేనేజర్ చల్లా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా

ఒంగోలు సిటీ: దీర్ఘకాలంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 22 నుంచి డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు డీఈఓకు వినతిపత్రం అందజేసినా ఉపయోగం లేదన్నారు. అన్ని క్యాడర్లు వారీగా సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలన్నారు. ప్రమోషన్ క్యాడర్‌లో సర్వీసు రెగ్యులైజేషన్, ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులు జారీ చేయాలని వినతిపత్రాలు ఇచ్చినా ఆ సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

ఒంగోలు టౌన్: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..ఉదయం 9.15 గంటలకు విజయవాడ నుంచి నెల్లూరు వైపు వెళ్లే రైలు వెళుతుంది. సంతపేట సాయిబాబా గుడి వద్దకు చేరుకోగానే 45 ఏళ్ల వయసున్న వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోయాడు. తీవ్రంగా గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నీలం, ఆరెంజ్, పసుపు రంగులు కలిసిన టీ షర్ట్ ధరించి వున్నాడు. టీ షర్ట్ మీద ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం లోగో ఉంది. జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు వెంటనే 9440627647కు ఫోన్ చేయాలని ఎస్సై అరుణ కుమారి కోరారు.